క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


నత్యం చేస్తున్న విద్యార్థులు

పీసీపల్లి: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని ఎంఈఓలు సంజీవి, శ్రీనివాసచారి అన్నారు. మండల పరిధిలోని నేరేడుపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయ దేవి అధ్యక్షతన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి


మాట్లాడుతున్న దేవిరెడ్డి రామిరెడ్డి

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. వెలిగండ్ల కేజీబీవీ స్కూల్‌లో సోమవారం విద్యార్థుల వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ సుశీల అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యమని.. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి.. బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డీవీ కొండమ్మ, ఉపాధ్యాయులు వి.బాలేశ్వరి, కె.సుధ, వి. రమణ, వై దీనవై, కె.సుమతి, డీవీ రత్నమ్మ, ఎం జోష్నా దేవి, మాధురి, స్వప్న, శృతి, రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపరాదు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని ఎస్సై అనూక్ హెచ్చరించారు. పొన్నలూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం వాహనాలు తనిఖీ చేపట్టి అనుమతి పత్రాలతో పాటు, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా బైక్‌లు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మైనర్లు బైకులు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదరాజుపాలెం, పామూరుపల్లి, నలజనంపాడు గ్రామాల కూడలిలో నిర్మితమైన కూడలి సంగమేశ్వర ఆలయంలో సోమవారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు సుసర్ల రామకృష్ణశర్మ ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం సుబ్రమణ్యేశ్వరస్వామి సహస్రనామార్చన అష్టోత్తర పూజలు చేశారు. సంగమేశ్వరస్వామికి ఏకరుద్ర అభిషేకం, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజ, కనకధారస్తోత్రం నిర్వహించారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

సీఎస్‌పురం(పామూరు): నాటుసారా తరలిస్తున్న వ్యక్తికి కనిగిరి కోర్ట్ సోమవారం రిమాండ్ విధించింది. మండలంలోని మైలుచర్ల గ్రామం నుంచి నాటుసారా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు కనిగిరి ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయబాస్కర్‌రావు, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నరహరిరావు సిబ్బందితో దాడులు నిర్వహించారు. మైలుచర్ల గ్రామంనుండి 5 లీటర్ల నాటుసారాతో వస్తున్న పోలేపల్లి జయరాములును అదుపులోనికి తీసుకొని నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించింది.

స్కౌట్స్, గైడ్స్ యూనిట్లు ప్రారంభం

జరుగుమల్లి(సింగరాయకొండ): స్కౌట్స్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటుతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాగుణం, నాయకత్వ లక్షణాలు, స్వీయరక్షణ అలవడుతుందని ఎంఈఓ-1 బి.నాగేంద్రవదన్ అన్నారు. కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారంస్కౌట్స్ గైడ్స్ యూనిట్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్‌లో చేరిన విద్యార్థులకు విద్యలో 0.5 శాతం, ఉద్యోగాల్లో 2 శాతం రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని వివరించారు. 10 తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఎల్ అనూరాధ, ఎస్ఎంసీ చైర్మన్ కె.పూర్ణచంద్రరావు, జిల్లా గైడ్స్ కమిషనర్ హెబ్సిబా, వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగమేశ్వరా.. మము బ్రోవరా


సంగమేశ్వరస్వామి


మహాశివరాత్రికి ముస్తాబవుతున్న సంగమేశ్వర ఆలయం

- త్రివేణి సంగమం సంగమేశ్వరాలయం
- మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- 25 నుంచి మార్చి 1 వరకు ప్రత్యేక పూజలు


ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దిన దృశ్యం

పొన్నలూరు: దక్షిణాది త్రివేణి సంగమంగా భక్తుల వేనోళ్లతో నీరాజనాలు అందుకుంటూ పొన్నలూరు మండలానికే ముకుటాయమానంగా నిలిచిన సంగమేశ్వరం ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. చుట్టపక్కల మండలాల్లో ప్రసిద్ధి కెక్కిన ఏకైక చారిత్రాత్మక మహాపుణ్య క్షేత్రం ఇదే. మహాశివరాత్రి పర్వదినంతో పాటు కార్తీక మాసం, ముక్కోటి ఏకాదశి పండుగలకు భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకుంటారు.

స్వామి స్థల పురాణం..

సంగమేశ్వరస్వామి పుట్టశిలగా ఉద్భవించి భక్తుల కొర్కెలు నెరవేర్చుతున్నాడు. మూడో శతాబ్దంలో రాజులకు సంబంధించిన గోవులను కాపరి సంగమేశ్వరస్వామి వెలసిన ప్రాంతానికి తోలుకొని వస్తాడు. ఇందులోని ఒక గోవు పుట్టపై తన పొదుగును ఉంచి పాలును వదులుతుంది. గోవు వదిలిన పాలును తాగుతున్న స్వామిని చూసిన కాపరి తన వద్దనున్న గండ్రగొడ్డలిని విసరగా ఆ గొడ్డలి స్వామి తలభాగంలో తగిలి కొంత భాగం లేచి ఎక్కడో పడుతుంది.

ఈ సందర్భంలో సంగమేశ్వరస్వామి అక్కడే లింగాకారంగా వెలుస్తాడు. ఇది చూసిన గోవుల కాపరి మూర్ఛపోతాడు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న రాజు ఈ సంఘటన చూసి ఆలయం నిర్మిస్తానని వాగ్దానం చేస్తాడు. అలా ఈ క్షేత్రానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఆలయం ఎగువన నేరెళ్లవాగును కలుపుకొని దక్షిణాన ప్రవహించే క్షీర నది(పాలేరు నది), ఉత్తరాన ప్రవహించే మాకేరు నదులు ఆలయం ముందుభాగంలో కలుస్తాయి. అందుకే సంగమేశ్వరం అని పేరొచ్చిందని, మూడు వాగులు కలిశాయి కాబట్టే దక్షిణాది త్రివేణి సంగమం అయిందని చరిత్ర చెబుతుంది. ఈ రెండు నదులు కలిసేచోట స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటే కోరికలు తీరతాయని భక్తుల విశ్వాసం.

ఆలయంలో పలు ఏర్పాట్లు...

సంగమేశ్వరం ఆలయంలో నూతన ఏర్పాట్లును చేశారు. దాతల సహకారంతో స్వామి నైవేద్యాలు తయారు చేయడానికి ప్రత్యేకంగా పాకశాల, అలాగే హోమాలు చేయడానికి యాగశాలను నిర్మించారు. వీటితో పాటు క్యూలో నిలబడే భక్తుల సౌకర్యార్థం ఎండ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేసి ఆలయానికి అందంగా రంగులు దిద్ది పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. రద్దీగా ఉన్నప్పుడు భక్తులు నెట్టుకోకుండా సౌకర్యార్థం బారికేడ్లు నిర్మించారు.

రవాణా సౌకర్యం....

కందుకూరు నుంచి కనిగిరి వెళ్లే ఓవీ రోడ్డు మార్గంలో పొన్నలూరు మండల పరిధిలోని చెన్నిపాడు అడ్డరోడ్డు వద్ద నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. సాధారణ రోజుల్లో అయితే కందుకూరు నుంచి బాలిరెడ్డిపాలెం, తంగెళ్ల సర్వీసులు ఆలయం మీదగా వెళతాయి. అలాగే పొదిలి డిపో నుంచి మర్రిపూడి, జువ్విగుంట మీదగా కందుకూరు సర్వీసూ ఆలయం మీదగానే వెళుతుంది. పండుగలకు ఒంగోలు, కనిగిరి, పొదిలి డిపోలు నుంచి కూడా అదనంగా ప్రత్యేక సర్వీసులు నడుపుతారు. ఈ ఏడాది కూడా 25 నుంచి మార్చి 1 వరకు ఆర్టీసీ వారు ప్రత్యేక బస్ సర్వీసులు కేటాయించారు.

అందుబాటులో వసతులు....

మహాశివరాత్రి, కార్తీకపౌర్ణమి వంటి పర్వదినాల్లో గుడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రెడ్డి సంక్షేమ సంఘం, కాకతీయ కమ్మవారి సంఘంతో పాటు పలు సంఘాల వారి ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం నిర్వహిస్తారు. అలాగే పలువురు దాతలు గుగ్గిళ్లు, పులిహోర, ఉప్మా వంటి అల్పాహారము అందజేస్తారు. దీంతో పాటు భక్తులకు స్నానాల గదులు, మంచినీటి వసతులును ఏర్పాటు చేశారు. రాత్రి జాగరం చేసే భక్తులకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

26న శివపార్వతుల కల్యాణం

కొండపి: మండలంలోని కొండపి, కట్టవారిపాలెం గ్రామాల మధ్య ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈ నెల 26న శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులుఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. రాత్రికి కండ్లగుంట రమణయ్య,తిరుపతమ్మ దంపతుల సహకారంతో విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.37 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామివారి ఆలయానికి ఆదివారం రూ.1,37,916 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్ నరసింహబాబు తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.39,500, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.26,130, ఆలయంవద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ..31,670, ఇతర విరాళాలకింద రూ.40,616 వచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ఎంపీడీఓగా బ్రహ్మయ్య బాధ్యతల స్వీకరణ

పామూరు: మండల పరిషత్ అధికారిగా ఎల్ బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న బొలినేని సురేష్ వ్యక్తిగత కారణాలదృష్ట్యా సెలవుపై వెళ్లగా టంగుటూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఎల్.బ్రహ్మయ్యను పామూరు ఎంపీడీఓగా జిల్లా అధికారులు నియమించగా ఆయన విధుల్లో చేరారు. ఆయన్ను కార్యాలయ ఏఓ చెన్నకేశవ రెడ్డి, పీఆర్ఏఈ షేక్.మస్తాన్‌వలి, కేటీవీ నరసింహారావు, ఎ.స్రవంతి సన్మానించారు.

కేజీబీవీలు పేద విద్యార్థులకు వరం


మాట్లాడుతున్న జీసీడీఓ హేమలత

సీఎస్‌పురం(పామూరు): కేజీబీవీలు విద్యార్థులకు వరం లాంటివని, రానున్న పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని జీసీడీఓ హేమలత, ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాల, కళాశాల వార్షికోత్సవం, పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం విద్యాలయం ఎస్‌ఓ షేక్.రేష్మ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీసీడీఓ, ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదవాలని, తద్వారా భవిష్యత్ బంగారుబాటగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను జట్లుగా చేసి ఒక్కో ఉపాధ్యాయిని ఆ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరమని, ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలకు కూడా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముందుగా పాఠశాలలో సరస్వతీపూజ చేశారు. విద్యాలయం ఎస్‌ఓ షేక్.రేష్మ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీకోసంలో ఒకే ఒక్క అధికారి


అర్జీ స్వీకరిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ ముస్తాక్

సింగరాయకొండ: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి అధికారుల గైర్హాజరు పరిపాటిగా మారింది. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు రావాల్సి ఉండగా తహశీల్దార్ టి.రవి సెలవు కారణంగా డిప్యూటీ తహశీల్దార్ షేక్ ముస్తాక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ సమస్యలపై 5 అర్జీలు వచ్చాయి. అయితే ఎంపీడీఓ కార్యాలయ నిర్వహణాధికారి జి.కృష్ణారావు కొద్దిసేపు వచ్చి వెళ్లిపోయారు. మిగిలిన ఏ శాఖ అధికారి కూడా ఈ పక్కకు రాలేదు. రాను రాను ఈ కార్యక్రమం పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇలాగైతే సమస్యలు ఏవిధంగా పరిష్కరిస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

చిన్నారులకు సృజనాత్మక విద్యనందించాలి


శిక్షణ తరగతుల్లో సూచనలిస్తున్న సూపర్‌వైజర్ షేక్ గౌషనీసాబేగం


పామూరులో మాట్లాడుతున్న జిల్లా ప్రథమ్ వెంకట్రావు, ఎంఈఓ కరుణకుమారి

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ చిన్నారులకు సృజనాత్మక విద్యనందించేందుకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎంఈఓలు ఎస్ రమణయ్య, పెద్దిరాజు అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐదో రోజు శిక్షణలో వారు మాట్లాడారు. ఈ సందర్భంఘా పలు అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం కోర్స్ డైరెక్టర్ బొప్పరాజు సుబ్బారావు, సూపర్‌వైజర్ షేక్ గౌషనిసాబేగం, ఆర్పీలు కె.వెంకటరెడ్డి, ఎస్. ప్రసాద్‌రెడ్డి, కె.జార్జి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పామూరు: పిల్లల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో ప్రాముఖ్యమని ఎంఈఓ జి.కరుణకుమారి, జిల్లా ప్రథమ్ ఎస్.వెంకట్రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణలో వారు మాట్లాడారు. హెచ్‌యం రామస్వామి, ఆర్పీలు సంపత్‌కుమార్, నాగయ్య, జాన్, సురేష్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, ఎంపీఎస్ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అవగాహన కల్గి ఉండాలని ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓ దాసు ప్రసాద్ అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 5వ రోజు శిక్షణలో వారు మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలకుమారి, ఆర్పీలు శేషగిరిరావు, వెంకటరెడ్డి, ఎం క్రిష్ణా, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్


మాట్లాడుతున్న ఏపీఎం గోపీనాథ్

కొండపి: డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదావేలీపై త్వరలో ఆడిట్ చేయనున్నట్లు ఏపీఎం గోపీనాథ్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మండలంలోని ప్రతి డ్వాక్రా గ్రూపును కూడా వారి ఆర్థిక లావాదేవీలు, పొదుపులు, అప్పుల రికవరీలు, వడ్డీల తదితర విషయాలపై పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహిస్తామన్నారు. సీసీలు, వీఓఏలు స్వయం సహాయక సంఘాలకు సమాచారం అందించి ఆడిట్‌కు అవసరమైన వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మండల సమైక్య కార్యదర్శి బొద్దులూరి సుభాషిణి, కార్యవర్గ సభ్యురాలు శారద, సీసీలు మల్లికార్జున, కృష్ణారెడ్డి, రామాంజనేయులు, అకౌంటెంట్ కోటేశ్వరి, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు


దేవస్థానరం భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన ఈఓ

సింగరాయకొండ: స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్‌లోని సర్వే నంబర్ 605-ఏ లోని 12 సెంట్ల స్థలంలో సోమవారం ఉదయం పాతసింగరాయకొండ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈఓ పి.కృష్ణవేణి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిలో ఆక్రమ కట్టడాలకు పాల్పడే ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని హెచ్చరిస్తూ శాశ్వత పద్ధతిన బోర్డు ఏర్పాటు చేశారు. గత నెల రోజుల్లో రెండుసార్లు ఈ స్థలంలో ఇదేవిధంగా హెచ్చరికలు చేస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఒంగోలు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ యానాదిరావు స్వయంగా వచ్చి ఏర్పాటు చేశారు. కానీ ఏర్పాటు చేసిన అరగంటలోనే ఫ్లెక్సీలు చించివేశారని, ఈసారి బోర్డు ఉంచుతారో లేదో చూడాల్సి ఉంది.

వేలంపాటలో రూ.22.40 లక్షల ఆదాయం


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లి పోలేరమ్మతల్లి దేవస్థానంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వస్తువుల విక్రయానికి సోమవారం నిర్వహించిన వేలంలో ఆలయానికి రూ.22.40 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై భైరాగి తెలిపారు. వేలం పాటలో చీరలు, జాకెట్లు వసూలు చేసుకోవడానికి రూ.5.52 లక్షలు, సప్లై సామగ్రి అద్దెకు ఇచ్చుకునేందుకు రూ.6.77 లక్షలు, ఫలహారాలు, కూల్‌డ్రింక్స్ అమ్ముకోవడానికి రూ.4.11 లక్షలు, ఐస్‌క్రీం విక్రయానికి రూ.3.11 లక్షలు, ఆటబొమ్మలు విక్రయించుకునేందుకు రూ.2.25 లక్షలు, తలనీలాలు పోగుచేసుకునేందుకు రూ.66 వేలకు పాడుకున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది కంటే రూ.1.67 లక్షలు అదనంగా వచ్చినట్లు తెలిపారు. కందుకూరు గ్రూపు- 2 దేవస్థానాల కార్యనిర్వహణాధికారి వీవీఎల్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

పొన్నలూరు: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ తనిఖీ అధికారి కిరణ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ మీటర్లు, సర్వీసులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సకాలంలో చెల్లించకుంటే సర్వీసు తొలగిస్తారన్నారు. పొగాకు బ్యారన్లకు అనుమతి లేకుండా విద్యుత్ కనెక్షన్ తీసుకుంటే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. విద్యుత్ శాఖాధికారి రఘురామయ్య, లైన్ మన్లు రంగారెడ్డి, మున్నా, నాగార్జున పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలు నిర్మించాలి

కొండపి: తవనం చెంచయ్య, పమిడి కోటయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్ అన్నారు. మండలంలోని పెరిదేపిలో ఎంఎస్కే భవనంలో ప్రజా నాయకులు, సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శులు తవనం చెంచయ్య, పమిడి కోటయ్య వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి వారు ఎంతో కృషి చేశారన్నారు. మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, సీనియర్ నాయకులు అంగలకుర్తి చినబ్రమయ్య, మల్లెల చిన్న పేతురు, మాధవి, బెంజిమెన్, ఎలమందమ్మ, సింగారావు, కాకర్ల మస్తానమ్మ, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వైభవంగా అశ్వవాహన సేవ


పూజల్లో పాల్గొన్న భక్తులు


గరుడవాహనంపై స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి 67వ సప్తాహ్నిక, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు సోమవారం నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శిష్ణుమూర్తి ఉత్సవమూర్తుల అశ్వవాహనసేవ, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజల్లో భాగంగా రుత్వికులు మంకాల శివప్రసాద్‌శర్మ, పప్పు శ్రీకాంత్ ఉదయం వేదపారాయణం, కూష్మాండహోమం, లఘుపూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం దీక్షాహోమాలు, వేదపారాయణం, నారాయణస్వామి ఉత్సవమూర్తికి పల్లకిసేవ, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమహావిష్ణుమూర్తిస్వామికి అశ్వవాహనం, రథంపై మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ఉభయదాతలు, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా ఉండాలి


రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతా యుతంగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ఆరవ సచివాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే అర్జీదారుల పట్ల జవాబుదారీ తనంగా, బాధ్యతాయుతంగా వ్యహరించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా, అలసత్వంగా వ్యవహరించినా తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తొలుత రిజిస్టర్లు, హాజరుపట్టికను, మోమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్ సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌కు ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మోహన్ వినతి


కలెక్టర్‌కు వినతి పత్రం అందచేస్తున్న మోహన్

కనిగిరిరూరల్: కనిగిరి ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మోడల్ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం ఒంగోలులోని గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందచేశారు. మోడల్ స్కూల్‌లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారని తెలిపారు. పాఠశాలలోని ఎండీఎం అమలు అధ్వాన్నంగా ఉందని, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. పది, ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున.. వారి త్వరగా ఇళ్లకు చేరేందుకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, ఆరోతరగతి నుంచి హాస్టల్ ప్రవేశంకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు తరచూ సెలవులు పెడుతున్నందున విద్యార్థులకు సిలబస్ పూర్తి కావడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా... తక్షణ చర్యగా చేపట్టాల్సిన పనులు చెప్పాలని అడిగారు. వెంటనే ఆయా సమస్యలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డీఈఓ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొండపి: మండలంలోని వెన్నూరు గ్రామంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేద పురోహితులు భారతల శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు చేశారు. ముందుగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, మహంకాళి కుటుంబసభ్యులను ఉదయం వేదమంత్రాలతో పూర్ణకుంభంతో ఆలయంలోకి తీసుకువచ్చారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామి మూలవిరాట్ అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.